# బివేరాఫ్ మైక్స్




(అది బెడ్‌రూమ్ ! ఒక మంచంలో బామ్మా, మరో మంచంలో పిల్లలిద్దరూ నిద్రపోతూ వుంటారు. అలారం సౌండ్‌కి బామ్మ కళ్లు నులుముకుని లేచి - అలారం పీక నొక్కి- పిల్లల దగ్గరికి వెళ్తుంది)

బామ్మ : సునీల్ ! విజయ్ ! ఒరేయ్ లేవండ్రా ! ఐదయింది ! ఇంకా నిద్రపోతున్నారా ? మీరీ రోజు పరీక్షలు రాయాలి కదా.... మరిచిపోయారా ? లేవండి లేవండి !

సునీల్ : (ఒక్కుదుటున లేచి) ఒక్క నిముషం బామ్మా (లేచి పక్కనే వున్న బాత్రూమ్‌లోకి వెళ్లి.... ముఖమదీ కడుక్కుని - పుస్తకంలో తల దూరుస్తాడు.)

బామ్మ : విజయ్ ! నువ్వింకా ఎంతసేపు నిద్ర పోతావురా ? లేలే!

విజయ్ : లేస్తున్నా బామ్మా !

(బద్ధకంగా లేచి... బాత్రూమ్‌లోంచి బ్రష్ తెచ్చుకుని బెడ్ రూంలోనే పళ్లు తోముకుంటూ వుంటాడు.. ఇంతలో ఎక్కడి నుండో... 'కౌసల్యా సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే'... శ్లోకం విన్పిస్తుంది. ఆ పాటకి అనుగుణంగా తల తిప్పుతూ బ్రష్ చేసుకుంటూ వుంటాడు.. కాసేపయ్యాక 'వినుడి వినుడి రామాయణ గాథా వినుడీ మనసారా')

సునీల్ : (విజయ్‌ని చూస్తూ) ఆపు, ఆపు ! పాటకి నీ డ్యాన్స్ అమోఘం గానీ వెళ్లి ముఖమదీ కడుక్కో, టైమైపోతోంది! మనం చదవాల్సింది ఎంతోవుంది!

(ఇంతలో - 'ఘనాఘనా సుందరా... కరుణారసమందిరా' మరో పాట)

సునీల్ : ఏం రికార్డులో ఏమో బామ్మా ! ప్రొద్దున్నే ఈ రికార్డుల గోలతో మాకు ఇటు చదువు ఒంట బట్టట్లేదు !

విజయ్ : 'పే...ద్ద' సౌండ్‌తో ప్రతిరోజూ... ఈ అరిగి పోయిన రికార్డుల్ని పెట్టిందే పెడ్తూ... పిచ్చెక్కిస్తున్నారు బామ్మా!

(ఇంతలో పనిమనిషి పదేళ్ల అమ్మాయి... వూడుస్తూ ఆ గదిలోకి వస్తుంది - ఎక్కడి నుండో మళ్ళీ మరో పాట 'రంభ హో.. హో' పాట విని - వూడుస్తోన్న చీపురుకట్ట పక్కన పడేసి - ఆ పాటకి అనుగుణంగా డ్యాన్స్ చేస్తూ వుంటుంది)

సునీల్ : వాటిజ్దిస్ ? ఈ పాటల్తోనే ఛస్తూంటే నీ డ్యాన్సులొకటి ! వెళ్లు వెళ్లు ! ఎవరు బామ్మా - రికార్డులు పెడ్తోంది !

బామ్మ : ఈ వారం రోజులూ వినాయక చవితి ఉత్సవాలు కదా నాన్నా! ఇక ఈ రోజు నుండీ - ప్రతిరోజూ యింతే !

విజయ్ : అవునవునూ... మనకిష్టమున్నాలేకున్నా - మనం విని తీరాల్సిందే!

సునీల్ : అమ్మో - దేవుడో - ఇక నేను పరీక్షలకెలా ప్రిపేర్ కావాలో వినాయకుడో ?

బామ్మ : నీకేం నాయనా ! నువ్వు పగటి పూటంతా - ఎంచక్కా స్కూల్లో వుంటావ్ ! మేమైతే రాత్రింబవళ్లూ యింట్లోనే ఛస్తాంగదా మేమేమైపోవాలీ... మా బాధ ఎవర్తో చెప్పుకోవాలీ ?

సునీల్ : నిజమే బామ్మా ! నాకు నిన్ను చూస్తే నిజంగానే జాలేస్తోంది!

సునంద : (వంటింట్లోంచి పిలుస్తూ) సునీల్, విజయ్, వచ్చి కాఫీ తాగి వెళ్లండి.

సునీల్, విజయ్ : వస్తున్నాం మమ్మీ !

(పిల్లలిద్దరూ వంటింట్లోకి వెళ్లిపోతారు, ఇంతలో గీత - సునీల్ వాళ్ళ చెల్లెలు - ఆగదిలోకి 'బామ్మా' అని పిలుస్తూ వచ్చేస్తుంది!- మళ్లీ మరోపాట - 'మేరే ఆంగనేమే - తుమారా క్యా కామ్ హై' గీత ఆ పాటకి అనుగుణంగా స్టెప్స్ వేస్తూంటే - పని అమ్మాయి వచ్చి)

పని అమ్మాయి : అమితాబచ్చన్ స్టెప్పులు అట్ల వుండయ్ ! ఇగో - ఇట్లుంటయ్!

(పని అమ్మాయి స్టెప్స్ చూపిస్తూ వుంటే గీత డాన్స్ చేస్తూ వుంటుంది! ఇంతలో సునీల్ వచ్చి, ఆ దృశ్యం చూసి గీత చెవులు మెలేసి...)

సునీల్ : యూ ఫూల్ ! ఇంకో నాల్గయిదు గంటల్లో మనం సెకండ్ యూనిట్ టెస్ట్ రాయాల్సి వుంది ! డ్యాన్స్ చేస్తూ కూర్చున్నావా? ఉండు.... డాడీకి చెప్పి నీ పని పడ్తా ! డాడీ... డాడీ !

(గీత పరుగున వెళ్లి - తన చేతుల్తో అతడి నోరు గట్టిగా మూసేస్తుంది)

విజయ్ : ఒరేయ్ ! నువ్వు ఎంజాయ్ చేయవ్ ! మమ్మల్నీ ఎంజాయ్ చేయనీవ్ ! నువ్వా పుస్తకాల పురుగువి! నీక్కావలసింది పుస్తకాలు ! పుస్తకాలు ! పుస్తకాలు ! - నీకు పుస్తకాల్ని తినడం-మమ్మల్ని తినడం తప్ప మరోటి తెలీదు! మా ఖర్మ!

సునీల్ : షటప్ ! మాటలు జాగ్రత్తగా రానీ, నన్ను అనడానికి నువ్వెవరివి ?

(ఇంతలో 'పుట్టింటోళ్లు తరిమేశారు ! అయ్యో పాపం పాపాయమ్మా' పాట ! గుడ్డతో నేల తుడుస్తోన్న పని అమ్మాయి- లేచి మళ్ళీ స్టెప్స్ వేస్తూ వుంటుంది ! అప్పుడే సునీల్ వాళ్ల తాతయ్య- ఆ గదిలోకి రావడంతో.. ఆ పనిపిల్ల పిల్లిపిల్లలా అయిపోయి తన పని తాను చేసుకుంటూ వుంటుంది)

తాతయ్య : ఒరేయ్ ! ప్రాంతీయ వార్తలు వచ్చే టైమవుతోంది ! కాస్త రేడియోలో న్యూస్ పెడ్తారా !

(తాతయ్య రేడియో ఆన్ చేస్తాడు ! ఇంతలో - వీధిలోంచి ఏదో అనౌన్స్‌మెంట్ విన్పిస్తూ వుంటుంది)

**" నేడే చూడండి ! మీ అభిమాన సినిమా థియేటర్ 'కిషోర్'లో కమల్ హాసన్, రాధిక నటించిన అత్యుత్తమ సాంఘిక చిత్రం స్వాతిముత్యం ! ఆలసించిన ఆశాభంగం ! నేడే చూడండి!**

**స్వాతిముత్యం ! స్వాతిముత్యం !! స్వాతిముత్యం !!!")**

విజయ్ : ఓహ్! స్వాతిముత్యం ! ఎంత మంచి పిక్చర్ తాతయ్యా! మామయ్య వాళ్లింటికి హైదరాబాద్ వెళ్లినపుడు రెండుసార్లు చూశాను ! ముఖ్యంగా ఆ పాట ! '**సువ్వీ - సువ్వీ - సువ్వాలమ్మా సీతాలమ్మా !**' కమల్ హాసన్ యాక్షన్ - ఓహ్! సూపర్బ్! సువ్వీ... సువ్వీ....

(విజయ్ ఆ పాట పాడుతూ - డాన్స్ చేస్తూ వుంటాడు)

తాతయ్య : విజ్జూ - ఒరేయ్ - కాసేపు నోర్మూసుకోలేవూ ? నన్ను కాస్త రేడియో విననీ తండ్రీ !

(ఇంతలో పెళ్లి పందింట్లోంచి పెళ్ళి మంత్రాలు - 'మాంగల్యం తంతునామేనా - మమజీవన హేతునాం !' కాస్సేపటికి - 'ఈ జీవన తరంగాలలో - ఆ దేవుని చదరంగంలో - ఎవరికి ఎవరూ సొంతమూ !')

తాతయ్య : భేష్ ! బావుంది ! ఓ వైపు మాంగల్యం తంతునామే - మరో వైపు ఈ జీవన తరంగాలలో....

(మళ్ళీ పెళ్లి పందింట్లోంచి కట్నాల చదివింపులు)

ఇప్పుడు గుర్రం గుండయ్య పెళ్ళి కుమార్తెకి ప్రేమతో ఇస్తోన్న కానుక ఇరవై రూపాయలు ! పెళ్లికొడుకు మేనత్త ! పేరేమిటన్నారూ? ఓహో - కొబ్బరికాయల కాంతమ్మ - ఏ వూరన్నారూ ? కొల్లూరా? ఆ - కొబ్బరికాయల కాంతమ్మ కొల్లూరు వారు పెళ్ళికుమారుడికి ప్రేమతో ఇస్తోన్న కానుక టీవీ సెట్ ! ఆ - ఎవరయ్యా మీరూ ? బెల్లం భద్రయ్య ! భలేవారే ! అలా పక్కకి దాక్కుంటారేం ? ఇలా రండి - ఎవరికీ కానుకా ? పెళ్ళికుమార్తెకా ? ఆ - బెల్లం భద్రయ్య పెళ్ళి కుమార్తెకి ప్రేమతో రాస్తోన్న కానుక స్టీల్ స్పూనూ!)

విజయ్ : అమ్మయ్య ! కరెంట్ పోయింది ! ఇప్పుడిక రికార్డుల గొడవా మంత్రాల గోలా ఏదీ వుండదు ! రాళ్ల వాన కురిసి వెలిసినట్టుంది!

(ఇంతలో వెహికిల్స్ హారన్ సౌండ్స్... పిపీమ్! పపామ్!)

సునీల్ : ఒరేయ్ విజయ్ - మళ్లీ ఏమిట్రా ఈ పిపీమ్ ! పపామ్‌లు !

విజయ్ : ఆ - ఏముందీ ? పోలింగ్ దగ్గర పడిందిగా ! ఎన్నికల ప్రచారం! ఎవరో సినీ యాక్టర్ వస్తున్నాట్ట ! ప్రచారం చేయడానికి ! పల్లెటూరి జనమంతా లారీల్లో, ట్రాక్టర్లలో వస్తున్నారు మనవూరు!

(బయటనుండి నినాదాలు: ఓట్‌ఫర్ పి.పి.రెడ్డి, ఓట్‌ఫర్ పి.పి.రెడ్డి, మళ్లీ మరో గ్రూప్ నినాదాలు: ఓట్‌ఫర్ కే.కే. రావు, ఓట్‌ఫర్ కే.కే.రావు)

సునీల్ : (జుత్తు పీక్కుని, పుస్తకాలు గిరాటేసి) ఛ ! ఈ రికార్డ్స్, అడ్వర్ట యిజ్ మెంట్స్, అనౌన్స్ మెంట్స్, స్లోగన్స్‌తో - నాకు పిచ్చెక్కి పోతుంది.

విజయ్ : డాడీకి చెప్పి, మనం రూం సౌండ్ ప్రూఫ్ చేయించుకుంటే...?

సునీల్ : నీ ముఖం ! మన దగ్గర అన్ని డబ్బులెక్కడివీ ?

గీత : ఒరేయ్ అన్నయ్యా ! నేనో ఐడియా చెప్పనా ?

విజయ్ : బాబ్బాబూ ! అదేదో చెప్పి, మమ్మీ గండంలోంచి గట్టెక్కించి పుణ్యం కట్టుకోవే !

గీత : ఆ ఏమీలేదూ ! మన మందరం వినాయకుడి దగ్గరికి వెళ్లి...

విజయ్ : ఊఁ... వెళ్లి....

గీత : ఆయనకి చెప్దామా ? భారతదేశంలో ఇకముందు పుట్టబోయే వాళ్లందర్నీ చెవిటి వాళ్లుగా పుట్టించమనీ ! అప్పుడు ఎవరికీ ఏ శబ్దాలూ విన్పించవ్... ఎలావుందిరా మన ఐడియా ?

విజయ్ : నీ ముఖంలాగే వుంది ! నోర్మూయ్ !

(తెర)

1988

**అంకితం**



**శ్రీమతి ఎ. అమృతారెడ్డి**
**నిజామాబాదు.**

సమకాలీన రాజకీయాలలో తనదైన శైలితో పట్టుదలగా దూసుకుపోతోన్న స్నేహితురాలు: **శ్రీమతి ఏలేటి అమృతారెడ్డి** కి....

ప్రేమతో.... —

1-11-2005